విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 12, నవంబర్ 2024

రైతులకు అన్నదాత సుఖీభవ ద్వారా తక్షణమే రూ.20 వేలు అందించాలి

ఏపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చిన్నప్ప యాదవ్

విశాలాంధ్ర-యాడికి (పెద్దవడుగూరు మండలం): రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద తక్షణమే రూ.20 వేలు అందించాలని డిమాండ్ చేస్తూ ఏపి రైతు సంఘము రాష్ట్రసమితి పిలుపు మేరకు పెద్దవడుగూరు మండలం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.వెంకటరాముడు యాదవ్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డిచిన్నప్ప యాదవ్, తాడిపత్రి సిపిఐ నియోజక కార్యదర్శి రంగయ్య, వెంకటరాముడు యాదవ్ హాజరై మాట్లాడుతూ, 2024 ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి రైతుకు రూ. 20వేలు పెట్టుబడిసాయం అందిస్తామని ప్రకటించి అమలు చేయడంలో విఫలం అయ్యారన్నారు. గత ప్రభుత్వ విధానాలవల్ల మన రాష్ట్రంలో ప్రతి రైతు కుటుంబంపై సుమారు 2 లక్షల 45 వేల రూపాయల రుణం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ లో రాయలసీమ జిల్లాల్లో కరువు పరిస్థితి మరో పక్క కోస్తా తీర ప్రాంత జిల్లాల్లో భారీ వర్షాలు, వరదలు ముంచె త్తడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఖరీఫ్ సీజన్లో సుమారు 12 లక్షల ఎకరాల్లో రైతాంగం పంటలు వేయలేక పోయారన్నారు. రబీ సీజన్ ప్రారంభమై రైతులు పెట్టుబడికోసం ఎదురుచూస్తున్న దశలో మీరు ప్రకటించిన రైతుకు 20 వేల రూపాయల పెట్టుబడిసాయం ఇచ్చి రైతులను ఆదుకోవాలన్నారు రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి అవసరమైన నిధులు రాబోయే బడ్జెట్లో కేటాయించి సాగునీటిరంగ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. పంటల బీమా సొమ్ము ప్రభుత్వమే భరించి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. పంటసాగు చేసి నష్టపోయిన రైతులకు నష్టపోయిన 15రోజులకే పరిహారం రైతుల ఖాతాల్లో రైతులఖాతాలో జమ అయ్యే విధంగా చట్టం చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని, జిల్లాలో 7మండలాలతో పాటు మిగతా 24 మండలాలను కరవుమండలాలుగా ప్రకటించి తక్షణమే కరువుసహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు నారాయణ, రైతు సంఘం తాడపత్రి నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు ఆదినారాయణ, ఓబిరెడ్డి, సిపిఐ నాయకులు రంగనాయకులు, హుస్సేన్ పీరా, ముత్యాల రెడ్డి,నారాయణ స్వామి, సుధాకర్‌గౌడ్, నాగేంద్ర, రామాంజనేయులు, అల్లాబకాష్, శేషు గోపాల్, చిన్న గంగులు, కిరణ్,చారుగుండ్ల వెంకటరాముడు,పెద్దన్న,సుంకయ్య, పక్రుద్దీన్ పాల్గొన్నారు.

రైతన్నలను ఆదుకోవాలి

విశాలాంధ్ర-గుంతకల్లు: ఏపి రైతుసంఘం రాష్ట్రసమితి ఆధ్వర్యంలో సోమవారం గుంతకల్ ఆర్డిఓ కార్యా లయం వద్ద ధర్నా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఎం వీరభద్ర స్వామి రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి రామాంజనేయులు యాదవ్, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి పీరాము రాయల్ మాట్లాడుతూ 2024 ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి రైతుకు రూ.20వేలు పెట్టుబడిసాయం అందిస్తామని ప్రకటించారని దాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. చెరవుల పునరుజ్జీవనా నికి తమరు దృష్టిసారించగలరు.32 మంది విద్యార్థుల ప్రాణత్యాగాలు, ప్రజాప్రతినిధుల రాజీనామా లతో సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటుపరం కాకుండా నిలువరింప చేసేందుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావా లన్నారు. కార్యక్రమంలో ఏఐటియుసి మండల కార్యదర్శి ఈశ్వరయ్య, ఏఐవైఎఫ్ నంద కిషోర్ ఎన్ కొట్టాల సయ్యద్ భాష రాముడు శ్యాంసుందర్, శంకరప్ప పాల్గొన్నారు.

హామీ నెరవేర్చడంలో విఫలం

విశాలాంధ్ర-ఆత్మకూరు: రాజకీయ నాయకులు అధికారం లోకి రావడానికి ఎన్ని రకాలైన హామీలు ఇవ్వడానికైనా వెనుకాడరు. దాని అమలు విషయం వచ్చేసరికి రకరకాల కొర్రీలు పెడుతుంటారు అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఆరు మాసాల కిందట ఎన్నికల ప్రచారంలో భాగంగా టిడిపి తాము అధికారంలోకి వస్తే రైతుకు పెట్టుబడి సాయం కింద ప్రతి ఏటా రు.20 వేల రూపాయలు ఉచితంగా అందిస్తామని హామీ ఇచ్చిందన్నారు. అది అమలు దగ్గరికి వచ్చేసరికి వారంతకు వారే సవరణ చేస్తూ రైతును మోసగిస్తున్నదని సీపీఐ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రు. ఇప్పుడు రు.20 వేలకు బదులు రు.14 వేలే ఇస్తున్నారని మరీ ఇంత దగా చేస్తారా అని ప్రశ్నించారు.. కేంద్ర ప్రభుత్వం గత ఐదేళ్లలో కూడా ప్రతి ఏటా రైతుకు రు.6000 చొప్పున నేరుగా రైతు అకౌంట్ లోకి మూడు విడతలుగా నగదు జమ చేస్తూ వచ్చింది. ఇప్పుడు ముఖ్యమంత్రి కేంద్రవు ప్రభుత్వం ఇచ్చే రు.6000 కలిపి రు.20000 ఇస్తున్నట్లు ప్రకటించారు. ఎన్నికల హామీలు ఇచ్చేటప్పుడు అది కలిపి ఇది కలిపి ఇంత ఇస్తామని చెప్పరని ఇవ్వడానికి బరువయ్యేసరికి ఇచ్చిన హామీలో ఎలా కోత పెట్టాలి అని ఆలోచిస్తారని ఇది ఒక పెద్ద దగా హామీ అని రైతులు గుసగుసలాడుకుంటున్నారు.

పెట్టుబడి సాయం మంజూరు చేయాలి

విశాలాంధ్ర-రాప్తాడు: ఎన్నికల వాగ్దానంలో భాగంగా రైతులకు ఇచ్చిన రూ.20వేలు పంట పెట్టుబడి సాయం హామీని కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని నియోజకవర్గం రైతు సంఘం అధ్యక్షుడు ఎం.చలపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ మన్నీల వెంకటరాముడు కోరారు.

ఈసందర్భంగా రాప్తాడు తహశీల్దార్ పి.విజయకుమారికి సోమవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చి ఆర్నెల్లయినా రైతుకు ఒక పైసా కూడా రిలీజ్ చేయకపోవడం దారుణమన్నారు. ఖరీఫ్ సీజన్లో సరైన సమయంలో వర్షాలు కురవక ఎక్కువ మంది రైతులు పంటలు కూడా చేయలేక పొలాలను బీళ్లుగా వదిలేసిన పరిస్థితి నెలకొందన్నారు. సాగు చేసిన కొద్ది మంది రైతులకు పంటలకు పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి అందక దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు కేంద్రం విడుదల చేసే పీఎం కిసాన్ నిధులతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రతి రైతు ఖాతాలో రూ. 20వేలు జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎం.వెంకటరాముడు, నారాయణ స్వామి పాల్గొన్నారు.

అన్నదాతకు చేయూతనివ్వండి

విశాలాంధ్ర-శింగనమల: రైతుల సమస్యలు పరిష్కరించాలని, సిపిఐ,ఏపిరైతు సంఘం రాష్ట్రసమితి పిలుపు మేరకు శింగనమల తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఏపి రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు బయన్న చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఏపీ రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు మధు యాదవ్ చేనేత కార్మిక సంఘం మండల కార్యదర్శి మధు పాల్గొన్నారు, అనంతరం ఏపీ రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు మధు యాదవ్ మాట్లాడుతూ 2024 ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి రైతుకు 20వేలు పెట్టుబడిసాయం అందిస్తామని ప్రకటించారు. అధికారం చేపట్టి ఆరు నెలలు అవుతున్న ఇచ్చిన హామీలు అమలు చేయలేదని మండిపడ్డారు రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి అవసరమైన నిధులు బడ్జెట్లో కేటాయించి సాగునీటిరంగ అభివృద్ధికి తోడ్పడాలన్నారు,చెరువులు అక్రమణలకు గురై కనీస మరమ్మత్తులకు నోచుకోలేదని, చెరవుల పునరుజ్జీవనానికి దృష్టి సారించాలన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటువరం కాకుండా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, నారప్ప, నాగబయన్న, శ్రీనివాసులు, బాలిరెడ్డి, రామాంజినేయులు, ప్రభాకర, మధురెడ్డి, రామాంజినాయక్ , రవిరెడ్డి, రమణ, దస్తగిరి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కుల గణనను తక్షణమే చేపట్టాలి...

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జగదీష్

విశాలాంధ్ర-అనంతపురం: ఆంధ్ర రాష్ట్రంలో కుల గణనను తక్షణమే చేపట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జగదీష్ పేర్కొన్నారు. సోమవారం సిపిఐ జిల్లా ఆఫీసులో పార్టీ జిల్లా కార్యదర్శి జాఫర్ అధ్యక్షతన జిల్లా పార్టీ కార్యదర్శివర్గ సమావేశం జరిగింది. ఇందులో సహయ కార్యదర్శులు నారాయణ స్వామి, మల్లికార్జున జిల్లా నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ... రాష్ట్రంలో కుల గణన చేపట్టవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తెలంగాణ, బీహార్ తదితర రాష్ట్రాలలో కుల గణన ప్రారంభమయినదని అని పేర్కొన్నారు. 2027 లో దేశవ్యాపితంగా పార్లమెంటు, ఆసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన జరుగుతున్న క్రమంలో కుల గణన చేపడితే దళితులకు, వెనకబడిన వర్గాలకు ఎక్కడెక్కడ ఏఏ స్థానాలలో', ఎన్ని నియోజకవర్గాలు రిజర్వేషను చేయాలో స్పష్టత వస్తుందని పేర్కొన్నారు. ఆయా కులాల ప్రజలకు ఏఏ ప్రభుత్వ పథకాలు అందించాలనే విషయం పాలకులకు తెలియ వస్తుందన్నారు. వీటితో పాటు కులాల జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల సంఖ్యను పెంచడం లేదా తక్కువ జనాభా ఉంటే తగ్గించడం లాంటి విషయాలలో కూడా రాజకీయ పార్టీలకు అవగాహణ వస్తుందని జగదీష్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రజలందరికి సమగ్ర, సమాన అవకాశాలు కల్పించబడతాయన్నారు. అభివృద్ధి ఫలాలను కులాల జనాబా ఆధారంగా పంపిణి చేయడానికి ప్రభుత్వానికి స్పష్టత వస్తుందన్నారు. కుల గణన చేపట్టడానికి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి బి.సి, దళిత, మైనార్టీ కుల సంఘాలను కలుపుకొని సదస్సులు, రౌండ్ టేబుల్ మీటింగులు జరపాలని పార్టీ శ్రేణులకు జగదీష్ సూచనలు చేశారు.

మైనారిటీలకు సంక్షేమాలు పునఃప్రాభించాలి..

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు ఇన్సాఫ్ నాయకుల వినతులు

విశాలాంధ్ర-అనంతపురం: గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు మైనారిటీల సంక్షేమ నిమిత్తం "దుల్హన్ పథకం", ఇమామ్, మౌజాన్‌లకు గౌరవ వేతనం, హజ్ హౌస్ నిర్మాణం, మసీదు మదరస మరమ్మతులకు నిధుల కేటాయింపు కోసం ప్రత్యేక నిధులు ఇవ్వడం జరిగిందని వీటిని పున ప్రారంభించాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు ఆల్ ఇండియా తంజీమ్-ఎ-ఇన్సాఫ్ అనంత నగర సమితి ఆధ్వర్యంలో నగర గౌరవ అధ్యక్షులు కె.అల్లిపిరా, నగర ప్రధాన కార్యదర్శి ఎస్.పి.ఖాజా హుస్సేన్ సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఆంధ్రప్రదేశ్ లో మైనారిటీలు దారిద్ర్య రేఖ కంటే దిగువలో ఉన్న వారు చాలా పెద్ద సంఖ్యలో ఉన్నారన్నారని వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు మైనారిటీ కార్పొరేషన్ ద్వారా విరివిగా రుణాలు, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టేవారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం సంక్షేమాలు మరచిందన్నారు. మైనారిటీలలో ఎంతో మంది ప్రతిభ గల విద్యార్థులు ఉన్నా వారికి విదేశీ విద్య అందని ద్రాక్ష వలే మిగిలిపోయింది అన్నారు. మైనారిటీ విద్యార్థు లకు విదేశీ విద్య చాలా అవసరం ఏర్పడిందన్నారు. ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్ళి, ఈ విషయం గురించి చర్చించి తక్షణమే మైనారిటీల సంక్షేమానికి పెద్ద పీట వేయాలని కోరారు. సంక్షేమాలు అమలు పరిచే విధంగా చర్యలు తీసుకోవాలని మరొకమారు విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు చాంద్ బాషా, హాజీవల్లి, దాదు, సద్దాం పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఆవిష్కరించిన మాజీ ఎంపీ తలారి రంగయ్య

విశాలాంధ్ర-శెట్టూరు : మండల పరిధిలో కరిడిపల్లి గ్రామంలో మాజీ ఎంపీ కళ్యాణదుర్గం నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య సోమవారం వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ముందుగా గ్రామంలో పెద్ద జ్యోతుల ప్రదర్శించి ర్యాలీ నిర్వహించారు. మహర్షి వాల్మీకి విగ్రహానికి పూలమాలేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాల్మీకి సోదరులందరూ కూడా ఐక్యమత్యంతో కలిసి వాల్మీకి మహర్షి అడుగుజాడల్లో నడవాలని, బాగా చదువుకుని అన్నిరంగంలో మనం ముందు ఉండాలని తెలియజేశారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయ తిప్పేస్వామి, బోయ వీరాంజనేయులు, ఎమ్మెస్ రాయుడు శెట్టూరు తిప్పేస్వామి, కృష్ణమూర్తి, శివకుమార్, జగన్, వైసీపీ నాయకులు కార్యకర్తలు వాల్మీకి కుల బాంధవులు పాల్గొన్నారు.

భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయం

విశాలాంధ్ర-అనంతపురం : భారతరత్న డాక్టర్ జనాబ్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతోత్సవాలలో భాగంగా అనంతపురం నగరం టవర్ క్లాక్ దగ్గరలో సోమవారం ఉదయం ఆయన విగ్రహానికి అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, అనంతపురం నగర మేయర్ వాసిమ్, నగర డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, మైనార్టీ నాయకులు, మత పెద్దలు పుష్ప మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మౌలానా అబుల్ కలాం ఆజాద్ వారి 137వ పుట్టినరోజును జాతీయ విద్యా దినోత్సవంగా కూడా జరుపుకుంటున్నామన్నారు. ఆయన దేశానికి అందించిన సేవలు మరువలేనివన్నారు. అలాగే జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉత్తమ ఉపాధ్యాయులకు, ఉత్తమ పిల్లలకు అవార్డులను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో మైనార్టీలకు ప్రభుత్వం నుండి అందించే అన్ని సంక్షేమ పథకాలు, ఉర్దూ స్కూల్స్, మైనార్టీ వెల్ఫేర్ సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తున్నదని, అదే దిశగా జిల్లా యంత్రాంగం పని చేస్తున్నదన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి కలెక్టర్, అనంతపురం నగర మేయర్, డిప్యూటీ మేయర్లు, మైనార్టీ నాయకులు, మత పెద్దలు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. దేశంలో మైనార్టీల నందు నిరక్షరాస్యులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారని, అందులో మహిళలు ఎక్కువ సంఖ్యలో చదువుకు దూరంగా ఉన్నారని తెలిపారు. అందువల్ల ప్రతి ఒక్కరూ చదివే విధంగా చూడాలని మతపెద్దలకు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అనంత పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ మొట్టమొదటిగా విద్యాశాఖ మంత్రిగా పనిచేసే ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని, వారి స్ఫూర్తితో మన మైనార్టీ విద్యార్థులకు ప్రోత్సహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ శాఖ ఏడి రసూల్, వివిధ మైనార్టీ సంఘ సంస్థల నాయకులు, మత పెద్దలు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఆజాద్‌ను స్ఫూర్తిగా చేసుకుందాం

విశాలాంధ్ర-అనంతపురం: భారత దేశానికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అందించిన సేవలు, ఆశయాలను స్ఫూర్తిగా చేసుకుందామని ఎస్పీ పి.జగదీష్ కొనియాడారు. దివంగత మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి పురస్కరించుకుని సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యా శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టి ఆయన విద్యా సంస్కరణలకు అంకురార్పణ చేశారని గుర్తు చేశారు. ఎన్నో విద్యాలయాలు తీసుకువచ్చి దేశంలో విద్యా రంగం అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. ఆయన చేసిన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం భారతరత్న అవార్డు సైతం ఇవ్వడం జరిగిందన్నారు. అంతే కాకుండా ఆ మహనీయుని పేరిట పలు విద్యాసంస్థలు కూడా ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు డి.వి.రమణమూర్తి, ఇలియాస్ బాషా (ఏ.ఆర్) సి.ఐ లు ధరణీకిశోర్, క్రాంతికుమార్, హరినాథ్, వెంకటేష్ నాయక్, ఆర్ ఐ రెడ్డెప్పరెడ్డి, జిల్లా పోలీసు కార్యాలయం ఏ.ఓ శంకర్, బి సూపరింటెండెంట్ ప్రసాద్, ఎస్పీ సిసి ఆంజనేయ ప్రసాద్, ఆర్ ఎస్ ఐ లు మగ్బూల్, ముస్తఫా, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, గాంధ్ల హరినాథ్ , లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

సమూల మార్పులకు శ్రీకారం



విశాలాంధ్ర - జెఎన్టియుఏ: విద్యారంగంలో ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు సమూల మార్పులకు శ్రీకారం చుట్టిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కృష్ణయ్య పేర్కొన్నారు. సోమవారం జె.ఎన్.టి.యూలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని చిత్ర పటానికి ఓ ఎస్ డి వీసీ ఆచార్య ఎన్.దేవన్న, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కృష్ణయ్య, డైరెక్టర్స్ పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. సామాజిక కార్యకర్త, విద్యావేత్త, స్వాతంత్ర్య సమరయోధుడు, పాత్రికేయుడు, కవి, రాజకీయవేత్త, పండితుడు, రచయితగా ప్రజల మనలను పొందారన్నారు.

ఘన నివాళులు

విశాలాంధ్ర-ఉరవకొండ : స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో స్వాతంత్ర్య భారతదేశ తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు సోమవారం రాయలసీమ ముస్లిం మైనార్టీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ ముస్లిం మైనారిటీ ఆర్గనైజేషన్ నాయకులు జిలాన్,రఫీ, కొలిమి జిలాన్, ఖాదర్ భాషా, ఇమ్రాన్, ఇర్ఫాన్, సలీం ఎంపిటిసి వన్నూరు సాహెబ్ గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పలు విద్యాశాఖలకు ఆద్యుడు

విశాలాంధ్ర-పామిడి: పామిడి పట్టణంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ 120వ జయంతిని సోమవారం సిపిఐ పార్టీ సీనియర్ నాయకుడు కె.రహీం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ దూరదృష్టి కారణంగానే దేశంలో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఏర్పడి, ఉన్నత విద్యకు అత్యున్నత మార్గం ఏర్పడింది. ఆజాద్ దేశంలో ఉన్నత విద్యకు ఊపిరిపోసిన మహనీయునిగా అభివర్ణించారు. అతనిని దేశ ప్రధాన వాస్తుశిల్పిగానూ అభివర్ణిస్తుంటారని పేర్కొన్నారు. 1920లో ఉత్తరప్రదేశ్లోని అలీఘర్లో జామియా మిలియా ఇస్లామియా స్థాపనకు ఏర్పడిన కమిటీలో ఆజాద్ కీలకంగా వ్యవహరించారని తెలిపారు. ఆ తర్వాత 19345 యూనివర్సిటీ క్యాంపస్‌లను న్యూఢిల్లీకి మార్చడంలో ప్రముఖ పాత్ర పోషించారని తెలిపారు. ఈ కార్యక్రమంలోకె.రహీం, బికెరహీం,తేల్ బాషా, దాబాబాబా, షేక్షా, వలి, రజక్, ఆర్మీ రఫీ, అల్లా,బషీర్, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఆజాద్ అడుగుజాడల్లో నడవండి..

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణంలోని పాత ఈద్గా వద్ద సోమవారం తెలుగుదేశం పార్టీ మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మొహమ్మద్ అయూబ్ ఆధ్వర్యంలో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ జెసి. ప్రభాకర్ రెడ్డి, ఎమ్మార్వో రజక్ వలి డాక్టర్ ఈజ్జాని హాజరైనారు. జెసి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ స్వాతంత్రం సమరయోధుడు, భారత దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా పనిచేసి భారత దేశంలో ఎన్నో విద్యా సంస్కరణలు ప్రవేశపెట్టారన్నారు. విద్యాశాఖ మంత్రిగా ఆ పదవికి వన్నె తెచ్చిన గొప్ప వ్యక్తి అన్నారు. కావున ప్రతి ఒక్కరు మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, సిడిపిఓ కౌన్సిలర్లు ముస్లిం నాయకులు కులస్తులు వక్ బోర్డు సభ్యులు తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

గుత్తి కోఆపరేటివ్ బ్యాంకు మరింత అభివృద్ధి చెందాలి

విశాలాంధ్ర-అనంతపురం: ది గుత్తి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ మరింత అభివృద్ధి చెందాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సోమవారం అనంతపురంలోని విద్యుత్ నగర్ సర్కిల్లో ఉన్న యస్.జె. టవర్స్ మొదటి అంతస్తులో ది గుత్తి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ లిమిటెడ్ నాల్గవ శాఖని ఎంపీ ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ బ్యాంకు ద్వారా పేద ప్రజలకు మంచి సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎమిరిటీస్ విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ చైర్మన్ మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు, ది గుత్తి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ లిమిటెడ్ అధ్యక్షులు షేక్ అబ్దుల్ జిలాని, డిసిఓ అరుణకుమారి, న్యాఫ్కబ్ డైరెక్టర్ సిహెచ్ రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

అనంత ఎంపీని కలసిన ఆర్‌డీఓ

విశాలాంధ్ర-అనంతపురం రూరల్: అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మినారాయణను సోమవారం అనంతపురం రెవెన్యూ డివిజనల్ అధికారి కేశవనాయిడు యంపీ క్యాంప్ కార్యాలయం నందు మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం రెవెన్యూ డివిజనల్ అధికారి కేశవనాయిడుతో యంపీ మాట్లాడుతూ.. అనంతపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని వాటిని క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలు తలెత్తకుండా పరిష్కరించాలని అదేశించారు. సమస్యలు వెంటనే పరిష్కరించే దిశగా తహసీల్దార్లకు సూచించాలన్నారు.

చేనేతలను ఆదుకోవాలి..

విశాలాంధ్ర-శింగనమల: చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఏపీ చేనేత కార్మిక సంఘం మండల కార్యదర్శి నేసేమధు ఆధ్వర్యంలో తాహసిల్దార్ బ్రహ్మయ్యకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం నేసే మధు మాట్లాడుతూ వ్యవసాయం తరువాత అతిపెద్ద పరిశ్రమ చేనేత పరిశ్రమ గత కొన్ని నెలలుగా చేనేత కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఒకవైపు చేనేత ముడి సరుకుల ధరలు పెరిగి తయారు చేసిన చీరలకు మార్కెట్ లేక ఇబ్బందులు పడుతున్నామని, ముడి సరుకులకు చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు,నేతన్న నేస్తం పథకం ద్వారా మగ్గంవున్న ప్రతి కార్మికునికి రూ.24 వేల ఇస్తామని హామీ ఇచ్చిందని, గృహావసరాలకు 200 యూనిట్లు ఉచితంగా ఇస్తామని హామీని అమలుచేయాలని డిమాండ్ చేశారు. మగ్గం వున్న ప్రతి కుటుంబానికి సిల్క్ రాయితీ నెల నెల 2000 సబ్సిడీ ఇవ్వాలని కోరారు. రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి మధు యాదవ్, చేనేత కార్మికులు శివశంకర్, గురుప్రసాద్, రామయ్య, రంగయ్య, మధురెడ్డి, దస్తగిరి, నరసయ్య, వెంకటరమణ, విశ్వరూప, రామాంజనేయులు పాల్గొన్నారు.

18న వ్యక్తిగత అర్జీల కార్యక్రమం

విశాలాంధ్ర-నార్పల : సీపీఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి పెద్ద పెద్దయ్య సిపిఐ మండల కార్యదర్శి సాకే గంగాధర ఆధ్వర్యంలో నవంబర్ 18న వ్యక్తిగత అర్జీల సమర్పణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సోమవారం మండల కార్యదర్శి గంగాధర్ పేర్కొన్నారు. ముందుగా అర్జీల కార్యక్రమాల కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం హయాంలో పేదలకు గ్రామాల్లో ఒకటిన్నర సెంట్లు, పట్టణాల్లో 1 సెంటు చొప్పున ఇళ్లస్థలాల పట్టాలు పట్టణాలకు సుదూరంగా నివాసయోగ్యంకాని ప్రాంతాలలో కేటాయించారని, అదీ సెంటు స్థలం పేదల నివాసానికి ఏమాత్రం సరిపోదని (సిపిఐ), ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు)లు ఆనాడే వైసిపి ప్రభుత్వానికి చెప్పినప్పటికీ ఖాతరు చేయకుండా నాటి ప్రభుత్వం మొండిగా ముందుకెళ్లింది అని తెలిపారు.కాకి లెక్కలతో 32 లక్షల మందికి ఇళ్లపట్టాలు యిచ్చినప్పటికీ పేదలు ఆ స్థలాలపట్ల సుముఖత చూపలేదన్నారు. పైగా ఇంటి నిర్మాణానికి ఇచ్చే ఆర్థిక సహాయం కూడా కేవలం రూ. 1,80,000 మాత్రమే ప్రకటించి ఆ ఆర్థిక సహాయంతో పునాదులు కూడా పూర్తిచేయలేమని పేదలెవ్వరూ కూడా ఇంటి నిర్మాణం చేపట్ట లేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చలాన్నారు. కార్యక్రమంలో సిపిఐ సహాయ కార్యదర్శి చాపల రామంజి, సిపిఐ సీనియర్ నాయకులు సుధాకర్, నారాయణప్ప, గూగూడు యంగప్ప, శీనా, రఫీ, పాల్గొన్నారు.

ఇతర విభాగాల పనులు వద్దు

విశాలాంధ్ర-రాప్తాడు: వీఆర్వోలకు ఇతర విభాగాల వర్కులు కేటాయించవద్దని తహశీల్దార్ పి.విజయకుమారికి వీ.ఆర్.ఓలు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో తమ విధులతోపాటు ప్రస్తుతం గ్రామస్థాయిలో నీరు సంఘం ఎన్నికలకు సంబంధించి ఓటర్ జాబితా తయారీ, మరో పక్క రీసర్వే రెవెన్యూ గ్రామసభలు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు, సాధారణ ఓటరు జాబితా కోసం ఇంటింటా సర్వే చేయడం, సెలవు రోజులైన శని ఆదివారాల్లో కూడా ప్రత్యేక క్యాంపులు పెట్టడం, బిఎల్ఓ విధులు వేయడం వల్ల పనిభారంతో ఇబ్బంది పడుతున్నామన్నారు కార్యక్రమంలో వీఆర్వోలు లక్ష్మీనారాయణ చౌదరి, సరస్వతి, రవికిరణ్, గీతారాణి, శిరీష, ఖుర్దూస్, మనోజ్ సాయి ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో లారీ దగ్ధం

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ మండలం బుదగవి గ్రామ సమీపంలో 42వ జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్ వల్ల లారీ దగ్ధమైంది. ఈ సంఘటనపై ఓనర్ నందకుమార్ మాట్లాడుతూ బళ్లారికి లారీలో వెళుతుండగా ఇంజన్లో నుంచి పొగలు రావడంతో వెంటనే గమనించి కిందికి దూకి తప్పించుకున్నాని చెప్పారు. హుటాహుటిన అగ్నిమాపక శాఖ అధికారులు అక్కడికి చేరుకొని మంటలను ఆర్పి వేశారు. లారీ మొత్తం కాలిపోయి రూ.15 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు ఆయన తెలిపారు.

13న జాబ్ మేళా

విశాలాంధ్ర-రాయదుర్గం టౌన్: ఈనెల 13న రాయదుర్గం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వేదికగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.యం. శ్రీనివాసులు సోమవారం ప్రకటనలో తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ, లైఫ్, నవ భారత్ ఫర్టిలైజర్స్, ఐఐఎఫ్ఎల్ సమస్త ఇక్కడికి వస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా నిరుద్యోగులకు అవకాశాలు కల్పిస్తారన్నారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 12, నవంబర్ 2024

ఆగిన మున్సిపల్ పదోన్నతులు చేపట్టండి..

ఎస్.టి.యు.నాయకుల డిమాండ్

విశాలాంధ్ర - హిందూపురం : ప్రభుత్వం చేపట్టిన పురపాలక, నగరపాలక ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్.టి.యు జిల్లా ఆర్థిక కార్యదర్శి గోపాల్ నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని పలు పాఠశాలలలో ఎస్.టి.యు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్ నాయక్ మాట్లాడుతూ పురపాలక, నగరపాలక ఉపాధ్యాయుల పదోన్నతుల షెడ్యూల్ ఇది వరకే వచ్చిందని, వివిధ కారణాలతో షెడ్యూల్ మేరకు జరగాల్సిన పదోన్నతుల ప్రక్రియ నిలిచిన నేపథ్యంలో రి-షెడ్యూల్ విడుదల చేసి పదోన్నతులు చేపట్టాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయుల పదోన్నతులతోపాటు, పాఠశాల సహాయకుల పదోన్నతులు వెంటనే చేపట్టాలని తెలిపారు. చాలా సంవత్సర తర్వాత పురపాలక, నగరపాలక ఉపాధ్యాయుల పదోన్నతులను చేపట్టుతున్నందున ఆలస్యం లేకుండా జరపాలని మొత్తం ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఆర్.డి.యం.ఏ.వారు పదోన్నతి ప్రక్రియలో ఎక్కడ రోస్టర్ ఆగిందో రికార్డులను పరిశీలించి దానిని కొనసాగించాలని ఇదివరకే ఇతర మేనేజ్మెంట్లో ఉపాధ్యాయులు ఎవరికైనా రోస్టర్ పాయింటు కేటాయించి ఉంటే వాటిని ఒక సంవత్సరం పైగా కాలం అయింది కాబట్టి రద్దు పరచాలని డిమాండ్ చేశారు. 30 శాతం ఐ.ఆర్ ను ప్రకటించాలి.బోధనేతర పనుల నుండి ఉపాధ్యాయులను తప్పించి బోధనకు పరిమితం చేయాలని 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని అపార్ ఐడీలు సృష్టించమని ఉపాధ్యాయులను ఒత్తిడికి గురి చేయడం సరికాదని అపార్ గడువు పొడిగించాలని,117 జీవో రద్దుచేసి పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ శాఖ అధ్యక్షుడు షమీవుల్లా ,ప్రధాన కార్యదర్శి గంగాధర్, ఇమ్రాన్, ప్రవీణ్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ద్రవ్య లోటు, రెవిన్యూ లోటు ఏ విధంగా భర్తీ చేస్తారు

సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.వేమయ్య యాదవ్

విశాలాంధ్ర-కదిరి: రాష్ట్ర బడ్జెట్‌లో ద్రవ్య లోటు, రెవిన్యూ లోటు ఏ విదంగా భర్తీ చేస్తారో తెలపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం. వేమయ్య యాదవ్ ప్రశ్నించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి 2,94,427.25 కోట్లతో అసెంబ్లీలో ఆర్థిక మంత్రి రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టారని ఇది కేవలం నాలుగు నెలలకు మాత్రమే ప్రవేశపెడుతున్న బడ్జెట్ అన్నారు.బడ్జెట్ ప్రసంగం మొదట్లోనే ఆర్థిక మంత్రి రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరిగిందని,రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాలేదని చెబుతూనే ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్ కంటే ఈ బడ్జెట్ మొత్తాన్ని అధికంగా చూపారని పేర్కొన్నారు.ద్రవ్య లోటు రూ.68,742.65 కోట్లుగా, రెవెన్యూ లోటు రూ.34,712.84 కోట్లుగా చూపారు కానీ ఈ లోటును ఏ రకంగా భర్తీ చేస్తారో చెప్పలేదన్నారు.విద్యుత్ రంగం విషయంలో ప్రజలపై భారాల మీద భారలు పడుతున్నా యని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజలపై విద్యుత్ భారాలు మోపకుండా పరిష్కారం చూపలేక పోవడం బాధాకరమన్నారు. ఇరిగేషన్ రంగానికి మాత్రం సమగ్ర ప్రాధాన్యత ఇచ్చారన్నారు.లోటు పూడ్చడానికి కేంద్రం నుండి నిధులు తెచ్చుకునేందుకు ప్రయత్నించాలని, ఉన్నత విద్యారంగానికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. తిరుపతి,అమరావతి, విశాఖపట్నం విజ్ఞాన కేంద్రాలుగా తీర్చిదిద్దుతూ యూనివర్సిటీలలో అధ్యాపకులు, సిబ్బంది కొరత లేకుండా చూడాలని, యూనివర్సిటీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కోస్తా ప్రాంతంలో వ్యవసాయాన్ని చక్కబెడుతున్న కౌలుదార్ల సమస్యలను ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోలేదన్నారు. కౌలు దారులకు కొత్త చట్టం తెస్తున్నామనే పేరుతో కేవలం కార్డులు ఇచ్చి సరిపెడుతున్నారని,కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వైద్యవిద్య రంగాలకు భారీ కేటాయింపుపై

మంత్రి సత్య కుమార్ యాదవ్ హర్షం

విశాలాంధ్ర-ధర్మవరం: రాష్ట్ర బడ్జెట్‌లో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ వైద్య విద్య కోసం రూ. 18,421 కోట్లు కేటాయించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు,ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్కు, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే, ఈ బడ్జెట్ కేటాయింపు 23 శాతం పెరిగినట్లు తెలిపారు. పాఠశాల, కళాశాల, ఉన్నత విద్య తరవాత అత్యధికంగా ఆరోగ్య రంగానికి కేటాయింపులు చేయడం ద్వారా ప్రజారోగ్య సంరక్షణకు ప్రాముఖ్య ఇచ్చినట్లయిందన్నారు. ప్రజల ఆరోగ్యం పట్ల రాష్ట్ర ప్రభుత్వం అత్యంత శ్రద్ధ కట్టుబాటును కొనసాగిస్తుందన్నారు అని తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వం హయాంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేనలోకి..

విశాలాంధ్ర-ధర్మవరం: పవన్ కళ్యాణ్ సమక్షంలో మంగళగిరిలో ధర్మవరం నియోజక వర్గానికి చెందిన వైసీపీ పార్టీ ముఖ్య నాయకులు జనసేన పార్టీలో చేరారని, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ధర్మవరం మున్సిపాలిటీకి చెందిన 31వ వార్డు కౌన్సిలర్ రమణమ్మ, 28వ వార్డు కౌన్సిలర్ సరితాల ఆశాబి,12వ వార్డు కౌన్సిలర్ తొండమల ఉమాదేవి, 12 వ వార్డు మాజీ కౌన్సిలర్ రమాదేవి, 13వ వార్డు మాజీ కౌన్సిలర్ డిష్ రాజు, వైసీపీ వార్డు ఇన్‌చార్జిలు 31వ వార్డు ఇంచార్జ్ తోపుదుర్తి వెంకటరాముడు, 28వ వార్డు ఇంచార్జ్ సరితల మహమ్మద్ భాషా, 12వ వార్డు ఇంచార్జ్ తొండమల రవి, సౌత్ ఇండియన్ కాపు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు తొండమల నాగార్జున, తొండమల సోమశేఖర్ పార్టీలో చేరామన్నారు. పవన్‌కళ్యాణ్ ఆశయాలు నచ్చి చిలకం మధుసూదన రెడ్డి అడుగుజాడల్లో ప్రజా సేవ చేయడానికి జనసేన పార్టీలోకి చేరినట్లు తెలిపారు.

15న లక్ష్మీ చెన్నకేశవ స్వామి కళ్యాణం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో గల శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో ఈనెల 15వ తేదీ శుక్రవారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి కళ్యాణ మహోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు సోమవారం ఆలయ ఈవో వెంకటేశులు, అన్నమయ్య సేవామండలి కమిటీ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి సేవాకర్తలుగా కీర్తిశేషులు రామయ్య భార్య లక్ష్మమ్మ వారి కుటుంబ సభ్యులు, వసుధాంజలి, గుండాల చంద్రశేఖర్, కుమారులు హర్షవర్ధన్, సాయి, దీప్తి సాయిలు వ్యవహరిస్తారని తెలిపారు. అదేవిధంగా ఇదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సేవాదాతలుగా రామకృష్ణమ్మ, శ్రీరామిరెడ్డి, లక్ష్మీదేవి, గంగిరెడ్డి, కుమారులు హేమకుమాం రెడ్డి, శ్యామల, కరుణాకర్ రెడ్డి, సవిత, హరీష్ రెడ్డి, హనీష్ రెడ్డి, గ్రీష్మారెడ్డి వ్యవహరిస్తారన్నారు.

ఆధ్యాత్మికతోనే మనశ్శాంతి

విశాలాంధ్ర-ధర్మవరం: ఆధ్యాత్మికతోనే మనశ్శాంతి లభిస్తుందని పిరమిడ్ ఆధ్యాత్మిక జ్ఞాన మందిరం సొసైటీ వారు తెలిపారు. సోమవారం గురువు సుభాష్ పత్రీజీ జన్మదినం సందర్భంగా వారు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. పట్టణంలోని ఆరు పిరమిడ్ కేంద్రాలలో గల వెయ్యి మంది ధ్యానులు పలు కూడలిలో శాఖాహార ర్యాలీని నిర్వహించారు. అనంతరం సొసైటీ వారు మాట్లాడుతూ సుభాష్ పత్రీజీ వేణి 1947లో జన్మించారని, 30 సంవత్సరాలు ధ్యాన ప్రచారం చేసి లక్షల మందికి ధ్యాన రూపంలో ముక్తిని కలిగించారని తెలిపారు. వయసుతో నిమిత్తం లేకుండా నేడు పిరమిడ్ కేంద్రాలలో తమ భక్తిని చాటుకుంటున్నారని తెలిపారు. అనంతరం 1500 మందికి భోజన పంపిణీ నిర్వహించారు.

నేత్రదానంతో మరో ఇద్దరి జీవితాల్లో వెలుగు

విశాలాంధ్ర-ధర్మవరం: నేత్రదానంతో మరో ఇద్దరి జీవితాల్లో మృతుడు గొల్ల ఇంద్ర తేజ తన కళ్ళను ఇచ్చి మానవతను చాటుకున్నాడని విశ్వదీప సేవా సంఘం వ్యవస్థాపకులు కోళ్ల మోరం చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ అనంతపురం జిల్లా పొట్టిపాడు గ్రామానికి చెందిన గొల్ల ఇంద్రతేజ (17) తండ్రి నరసింహులు ఈనెల 10వ తేదీన మరణించగా విశ్వదీప సేవా సంఘం వారు వారి కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించి వారి సహకారంతో విశ్వ దీప సేవా సంఘం ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, హైదరాబాద్ ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్ శ్రీకాంత్ సర్వజన ఆసుపత్రిలో నేత్రాలను సేకరించామన్నారు. నేత్రదానానికి సహకరించిన దాత తల్లితండ్రులు గొల్ల నరసింహులు తల్లి ఆదిలక్ష్మి గారికి విశ్వదీప సేవా వారు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సేవా సంఘం మాజీ అధ్యక్షులు బిల్లు నాగరాజు,సురేష్, లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్, రఘు, తదితర సభ్యులు పాల్గొన్నారు

ఘనంగా మైనార్టీ సంక్షేమ దినోత్సవం

విశాలాంధ్ర-ధర్మవరం: ముస్లిం మైనార్టీ డెవలప్మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు యం.యం.డి. ఇమామ్ ఆదేశాల మేరకు పట్టణంలోని కోట ప్రభుత్వ మున్సిపల్ హైస్కూల్‌లో మైనార్టీ వెల్ఫేర్ డే సందర్భంగా ముస్లిం మైనారిటీ డెవలప్‌మెంట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ 137వ జయంతి ,జాతీయ విద్యా దినోత్సవం" వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో కలసి కేక్ కట్ చేయించి మిఠాయిలు పంచి శుభాకంక్షలు తెలిపారు. ఆజాదుకు నివాళులు అర్పించారు. మౌలానా అబ్దుల్ కలాం భారతదేశ తొలి విద్యామంత్రిగా పనిచేస్తూ విద్యా విధానంతో పాటు దేశ అభివృద్ధికి ఎంతో తోడ్పాటు అందించారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సయ్యద్ రోషన్ జమీర్, ధర్మవరం నియోజకవర్గం అధ్యక్షుడు సయ్యద్ దాదా పీర్, ధర్మవరం అధ్యక్షులు ముల్లా ఫారూఖ్, మదీనా మసీదు కమిటీ సభ్యులు ఇనాయతుల్లా, శామీర్, ఇలియాజ్, జిక్రీయా,ఖాదర్ వలీ, అప్సర్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం



విశాలాంధ్ర-ధర్మవరం: స్థానిక కె.హెచ్.ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్. యూనిట్ అధ్వర్యంలో వైస్ ప్రిన్సిపాల్ డా.బి. త్రివేణి అధ్యక్షతన జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డా.త్రివేణి మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్వాతంత్ర్య ఉద్యమం సమయంలో అరబ్దేశాల మద్దతును (ఇండియాకు) తెలిపేలా కృషిచేశారన్నారు. విద్య ఉంటే ప్రపంచంలో గౌరవం దక్కుతుందన్నారు. ఆజాద్ 1947 నుండి 1958 వరకు "దేశ మొదటి విద్యా మంత్రిగా/మానవ వనరుల అభివృద్ధి మంత్రిగా విశేష సేవలందించారన్నారు. ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం అధికారి డా.బి. గోపాల్ డా,ఎస్. షమీవుల్లా, డా. ఎస్.చిట్టెమ్మ, ఎం.భువనేశ్వరి, ఎ.కిరణ్ కుమార్, సరస్వతి, మీనా, బి. ఆనంద్, హైమావతి పాల్గొన్నారు.

చౌక ధాన్యపు డిపోల తనిఖీ ..

విశాలాంధ్ర గుడిబండ మండలంలోని కొంకలు, గుడ్డలహళ్లి, గ్రామంలో చౌక దుకాణాలను సోమవారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేపట్టారు ఈ రెండు షాపులో కార్డు లబ్దిదారులకు సక్రమంగా సరుకులు పంపిణీ చేయలేదని తమ పరిశీలనలో తేలినట్లు విజిలెన్స్ అధికారులు జామల్ భాషా తెలిపారు ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న నిత్యావసర సరుకుల డీలర్లు స్వాహా చేశారని గ్రామంలో కార్డు లబ్దిదారులు ఫిర్యాదు అంది విధంగా చక్కెర,కందిపప్పు, నిర్ణయించిన ధర కంటే అదనంగా వసూలు చేశారని కార్డు లబ్ధిదారులు తమకు ఫిర్యాదు చేశారని అన్నారు,వెల్లడనట్లు వారు తెలిపారు నివేదించడానికి ఈ విషయంలో ఉన్నత అధికారులకు నివేదిక పంపిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు శిరివరం విద్యార్థులు..

విశాలాంధ్ర-లేపాక్షి: మండలంలోని శిరివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో జరిగిన వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు రవిశంకర్, వ్యాయామ ఉపాధ్యాయుడు సంపత్కుమార్లు సోమవారం తెలిపారు. శిరివరం గ్రామ సర్పంచ్ నేత్రావతి కుమార్తె 8వ తరగతి చదువుతున్న స్ఫూర్తి ఏలూరు జిల్లా కైకారంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీల నందు ప్రతిభ కనబరిచి 4×100 మీటర్లు పరుగు పందెంలో కాంస్య పతకాన్ని సాధించినట్టు తెలిపారు. 7వ తరగతి చదువుతున్న మహిధర్ అన్నమయ్య జిల్లా అంగల్లులో నిర్వహించిన జిల్లా స్థాయి బాల్బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని ప్రతిభకనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. 8వ తరగతి చదువుతున్న ఎం.అభిలాష్ అనే విద్యార్థి జిల్లా స్థాయి వాలిబాల్ పోటీల్లో పాల్గొని విజయనగరం జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు వారు తెలిపారు. సర్పంచ్ నేత్రావతి, గ్రామపెద్దలు ఉపాధ్యాయులు అభినందించారు..

మంత్రి సవితకు ధన్యవాదాలు

విశాలాంధ్ర - అగళి : 2024-25 బడ్జెట్ లో బీసీ సంక్షేమ శాఖకు రూ. 39 వేల కోట్లు కేటాయించడంపై బీసీ సామాజిక వర్గం నేతలను సోమవారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవితకు బీసీ సంఘ నేతలు ధన్యవాదాలు తెలిపారు. అమరావతిలోని వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆమెను కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. నిధుల కేటాయింపునకు సహకరించిన సీఎం చంద్రబాబు నాయుడుకు, రాష్ట్ర ఐటీ, మానవరుల శాఖ మంత్రి నారా లోకేశ్ కు, రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవళ్ల మురళి, టీడీపీ సత్యసాయి జిలా అధ్యక్షులు కుళ్లకుంట వడ్డె అంజనప్ప కుంచిటిగ వక్కలిగ సాధికర సమితి కన్వీనియర్ విఎం పాండురంగప్ప గారు, వడ్డెర సంఘ జిల్లా అధ్యక్షులు మల్లెల జయరామ్, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బి.రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక విద్యా వ్యవస్థకు బాటలు వేసిన మహనీయుడు అజాద్..

విశాలాంధ్ర-ధర్మవరం: దేశంలో స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశ విద్యావ్యవస్థను సమూలంగా మార్చటానికి అడుగులు వేసిన తొలి వ్యక్తి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ అని వివేకానంద డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ భాస్కర్ రెడ్డి, డైరెక్టర్ బాలం లక్ష్మీనారాయణ రెడ్డి,ప్రిన్సిపాల్ హర్ష వర్ధన్ తెలిపారు. సోమవారం జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా స్థానిక రేగాటిపల్లి రోడ్డు నందు గల శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాల నందు భారతరత్న డాఎం మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జన్మదిన వేడుకలను విద్యార్థులు, అధ్యాపకులు నడుమ ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ భాస్కర్ రెడ్డి, డైరెక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డి, ప్రిన్సిపాల్ హర్షవర్ధన్ మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా విద్యా రంగంలో విశిష్ట సేవలు అందించిన కామర్స్ విభాగాధిపతి కృష్ణయ్యను సత్కరించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఆజాద్ విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన తొలి ఐదేళ్ల కాలంలోనే యుజిసి, ఐసీసీఆర్, ఏఐసిటియు, సి ఐ ఎన్ అర్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలతోపాటు ఖరగ్పూర్‌లో సాంకేతిక విద్యాసంస్థను ఏర్పాటు చేశారని తెలిపారు. 1992లో భారత ప్రభుత్వం ఆయనకు అత్యున్నత పురస్కారం 'భారతరత్న' ఇచ్చి గౌరవించిందన్నారు. కార్యక్రమంలో కళాశాల ఏవో రమేష్,అధ్యాపక బృందం, బోధ నేతల సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు రూ.20 వేల పెట్టుబడి సహాయం తక్షణమే అమలు చేయాలి

సిపిఐ రైతు సంఘం డిమాండ్....

విశాలాంధ్ర-చిలమత్తూర్ రూరల్: మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాల యంలో సోమవారం సిపిఐ నాయకులు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గోవిందరెడ్డి, మండల నాయకుడు లక్ష్మీనారాయణ రైతులకు రూ.20 వేలు పెట్టుబడి సాయం తక్షణమే అమలుచేయాలని సోమవారం డిప్యూటీ తహసిల్దార్ జగన్నాథ్‌కు వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలన్నారు. వరుస కరువులు అతివృష్టి ఒకవైపు అనావృష్టి ఒకవైపు వేధిస్తూ రైతులను అతలాకుతలం చేస్తూ వారు వ్యవసాయం వైపు చూడాలంటే భయపడే పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. ప్రభుత్వం వెంటనే చొరవి చూపి రైతుకు ఖచ్చితమైన గిట్టుబాటు ధర, ఇన్పుట్ సబ్సిడీ రుణమాఫీ రైతుకు సబ్సిడీతో ఎరువులు ,విత్తనాలు పంపిణీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఆదినారాయణ రెడ్డి, నాగిరెడ్డి, ఆవులు రెడ్డి, సుధాకర్ రెడ్డి, వెంకటేశప్ప, గంగాధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి

విశాలాంధ్ర-తనకల్లు: తనకల్లు మండలం కూడా కరువు మండలంగా ప్రకటించాలని సోమవారం ఏ పి రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులతో కలిసి తాహసిల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని విధాలా వెనకబడ్డ తనకల్లు మండలంను కరువ మండలం గా ప్రకటించకపోవడం చాలా దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాభావ పరిస్థితుల వలన పంట దిగుబడి అంతంత మాత్రం కాగా దిగుబడి వచ్చే సమయంలో తుఫాను ప్రభావం వల్ల రైతులు పూర్తిగా నష్టపోయారని రైతులకు ఇన్పుట్ సబ్సిడీతో పాటు హామీ ఇచ్చిన పెట్టుబడి సాయాన్ని వెంటనే అందించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రెవిన్యూ ఆఫీసర్ మల్లికార్జున్ రావుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కౌలు వయసుల సంఘం అధ్యక్షుడు చౌడప్ప యాదవ్ ,రైతు సంఘం నాయకులు కరీముల్లా, ఇక్బాల్, ఇర్ఫాన్, నరసింహులు, హైదరాబాద్ ఓబులేసు, నాగార్జున, సోమశేఖర్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడను కరువు మండలంగా ప్రకటించాలి

విశాలాంధ్ర-నల్లమాడ: నల్లమాడ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి చంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రంగనాయకులకు వినతిపత్రం అందజేశారు. నల్లమాడ కరువు కోరల్లో చిక్కిందని, రైతులకు రుణమాఫీ, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ తదితర పథకాలు ప్రవేశ పెట్టాలని కోరారు.

ప్రజల ఆకాంక్ష రాష్ట్ర అభివృద్ధికి అద్దం పట్టేలా బడ్జెట్

విశాలాంధ్ర-హిందూపురం : అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర ప్రజల ఆకాంక్షకు రాష్ట్ర అభివృద్ధికి అద్దం పట్టేలా ఉందని టీడీపీ జిల్లా అధ్యక్షులు వడ్డే అంజనప్ప సోమవారం అన్నారు. బడ్జెట్ పై స్పందిస్తూ పత్రికా ప్రకటన సోమవారం విడుదల చేశారు. కూటమీ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రవేశపెట్టిన మొట్టమొదటి వార్షిక బడ్జెట్లో కేటాయింపులు ప్రాధాన్యాలుగా చూస్తే విద్య వైద్య వ్యవసాయ రంగాలకు మంచి కేటాయింపులు చేశారని, ఆరోగ్య రంగానికి 19 వేల కోట్లు వ్యవసాయ రంగానికి 43,500 కోట్ల కేటాయింపు చేయడం హర్షనీయమని అన్నారు. అలాగే పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి కోసం 17 వేల కోట్లు కేటాయించడం గ్రామాల అభివృద్ధికి మన కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని అర్థమవుతుందని అన్నారు. రోడ్లు, భవనాలకు సంబంధించి దాదాపు పదివేల కోట్లు కేటాయించడం సంతోషించదగ్గ విషయమని వడ్డే అంజనప్ప అన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-పుట్టపర్తి: మండల కేంద్రంలోని గంటల మారమ్మ గుడి వద్ద సోమవారం సాయంత్రం 3 గంటల సమయంలో ద్విచక్ర వాహనం బస్సును ఢీకొన్న ఘటనలో నాలుగేళ్ల బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. పుట్టపర్తి నుంచి గోరంట్ల వైపు దేవేంద్ర తన కుమారుడు శరత్(4)తో కలిసి గోరంట్ల వైపు ద్విచక్ర వాహనంలో వెళుతున్నాడు. సరిగ్గా గంటల మారెమ్మ గుడి వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఢీ కొట్టింది బాలుడికి తీవ్రగాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని పేర్కొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

విశాలాంధ్ర-గుడిబండ: మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ మాజీ ఎంపీపీ ఎల్.ఎన్.నరసింహప్ప, స్థానిక సర్పంచ్ జీబీ కరుణాకర్, వైకాపా మండల అధ్యక్షుడు తదితరులు (సిసిగిరి సర్పంచ్) డి.యల్.యంజార్ గౌడ్,ఎంపీటీసీ పుష్పలత నాగేంద్ర, మాట్లాడుతూ నియోజకవర్గం వ్యాప్తంగా ఇంటివల్ల కురిసిన వర్షాలతో మడకశిర నియోజకవర్గంలోని రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు ఐదు మండలాల రైతులకు సంబంధించిన వేరుశనగ, రాగి మొక్కజొన్న కంది ఉలవలు కాయలు కాసే సమయానికి వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో పంటకోత సమయంలో అధిక వర్షాలతో పంట నీటమునిగి వేరుశనగ రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మడకశిర నియోజకవర్గంలోని రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని తెలిపారు.

స్మశాన వాటికను కేటాయించండి

విశాలాంధ్ర-పుట్టపర్తి: సత్యసాయి జిల్లా కేంద్రంలో స్మశాన వాటికను కేటాయించాలని ముస్లిం నాయకులు కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌కు సోమవారం మైనార్టీ నాయకుడు మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకేంద్రంలోని ముస్లిం మైనార్టీలు చనిపోయిన తర్వాత ఖననం చేసుకోవాలంటే చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. మౌలానా అబుల్ కలం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని సాయి ఆరామంలో ఆయన చిత్రపటానికి కలెక్టర్‌తో పాటు ముస్లింసోదరులు నివాళులర్పించారు. ముస్లింమైనార్టీలు స్మశానవాటిక లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కలెక్టర్ సమస్యను పరిష్కరించాలన్నారు. పుట్టపర్తిలో ఉర్దూ పాఠశాల ఏర్పాటు చేయాలన్నారు. ముస్లిం సోదరులు పెళ్లిళ్లు చేసుకోవడానికి అనుకూలంగా గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కోటి 25 లక్షలు హెచ్చించి షాదిఖాన నిర్మిస్తే గతప్రభుత్వం దానిని గాలికి వదిలేయడంతో రుపయోగంగా మారింది. తిరిగి తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వచ్చిన తక్షిణమే 55 లక్షల రూపాయల నిధులను కేటాయిస్తే భవనం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చి కార్యక్రమాలు చేసుకోవడానికి అనువుగా ఉంటుందన్నారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు మహమ్మద్ రఫీ పేర్కొన్నారు. కార్యక్రమంలో శామీర్ ,అసిన్ కుల్లాయప్ప , సయ్యద్ , ఫక్రొద్దిన్ దాదాఖలందర్ పాల్గొన్నారు.

పెనుకొండ రైల్వే స్టేషన్‌కు త్వరలో రోడ్డు వేస్తాం

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ పట్టణంలో రైల్వే స్టేషన్ రోడ్డును సోమవారం హిందూపురం ఎంపీ బి కే పార్థసారథి కార్యకర్తలతో కలిసి రైల్వేస్టేషన్ రోడ్డును పరిశీలించారు. రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు ఏర్పాటుకు సంబంధించి సంబంధిత అధికారులతో చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పెనుకొండలో రైల్వే స్టేషన్ రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు లేక చాలా అధ్వానంగా ఉందని, కియా కార్ల కంపెనీ వచ్చిన తరువాత పెనుకొండ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో రైల్వే స్టేషన్ రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ చాలా అధ్వానంగా ఉన్నాయి వీటిని బాగు చేయాలని ప్రజల నుంచి వినతిపత్రాలు వచ్చాయని. ఎంపీ నిధులతో త్వరితగతిన నిర్మిస్తామని తెలిపారు.

కనుల పండువగా జల్దీ మహోత్సవం

విశాలాంధ్ర - అగళి : మండలంలోని దొక్కలపల్లి గ్రామం సమీపంలో అక్కాగార్ల దేవరపల్లి పొలిమేరలో వెలసిన ఏడుగురు అమ్మ వార్లు బొమ్మ లింగేశ్వర స్వామి ఉత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. మూడు రోజులపాటు జరిగిన ఉత్సవాల్లో భాగంగా సోమవారం భక్తిశ్రద్ధలతో జలది కార్యక్రమం నిర్వహించారు. నూతన విగ్రహాల పునః ప్రతిష్టపన, పొలిమేర వంకలో జల్దీ ఉత్సవం, దేవాలయం విమాన గోపురంపై వేద పండితులచే కలశ స్థాపన, దొక్కలపల్లి గ్రామం అర్చకుల ఇంటి నుండి ఉత్సవ విగ్రహం కళశాల ఊరేగింపు, వివిధ హోమ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఉత్సవం వంద సంవత్సరాలు తరువాత జరగడంతో ఉత్సవంలో సమీప గ్రామాల నుండియే గాక కర్ణాటక రాష్ట్రము నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉత్సవాన్ని విజయ వంతంగా కృషి చేసిన వారికి ఆలయ కమిటీ తరుపున శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సన్మాన చేశారు.

పత్రికా ప్రకటన

శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర తాలూకా గుడిబండ మండలం గుడిబండ గ్రామ పంచాయతీ గుడిబండ గ్రామమునకు చెందిన H.అరుణజ్యోతి w/o.సుధాకర్ అను నేను నాకు సంబంధించిన Document 471/2004, Aadhar No. 7891 8426 1547 గల సర్వే నెంబరు 465-1B నందు 1-14 సెంట్ల విస్తీర్ణము గల భూమికి సంబంధించిన Original Land Documentsను మా స్వగ్రామము (గుడిబండ) నుండి అనంతపురం పట్టణమునకు బస్సులో బయలుదేరుతుండగా Documents Filesను పోగొట్టుకున్నాను. ఎవరికైనా దొరికితే కింద గల చెరవాణి నెంబరుకు తెలపగలరు.

ఇట్లు
అరుణజ్యోతి

తేది : 11/11/2024 Cell 8309933856
స్థలము : గుడిబండ

గ్రామసభల ద్వారా భూ సమస్యలు పరిష్కరించాలి - కలెక్టర్

విశాలాంధ్ర-పుట్టపర్తి : వారంలో నాలుగు రోజులు మాత్రమే గ్రామసభలు నిర్వహించి భూ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ టిఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి 253 అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. కలెక్టర్‌తో పాటు కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్డీఓ సువర్ణ, సి పి ఓ విజయ్ కుమార్, డ్వామా పిడి విజయేంద్ర ప్రసాద్, డిపిఓ సమత, ల్యాండ్ సర్వే ఏడి విజయశాంతి తదితరులు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రీవెన్స్ లో వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుపై అలాగే స్వర్ణాంధ్ర 2047 అమలుపై ప్రణాళికలు నివేదికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఏపీఎంఐపి పిడి సుదర్శన్, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, డిఎంహెచ్ఓ మంజువాణి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రోడ్డును నాణ్యతతో త్వరతగతిన పూర్తి చేయండి

విశాలాంధ్ర-కదిరి: రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు లోపించకుండా త్వరితగతిన పూర్తి చెయ్యాలని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం కదిరి-రాయచోటి రోడ్డు నిర్మాణంలో భాగంగా ఎన్పీకుంట వరకు దాదాపు 30 కిలోమీటర్లు జరుగుతున్న తారు రోడ్డు పనులను పరిశీలించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ప్రయాణికుల సౌకర్యార్థం ఈ రోడ్డు నిర్మాణాన్ని డిసెంబర్ లోపు పూర్తి చేస్తామని తెలిపారు. గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం కేవలం ఈ రహదారిలో కల్వర్ట్ పూర్తి చేసింది తప్ప రోడ్డు నిర్మాణంలో అలస్యం చేసిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. టీడీపీ నాయకులు కృష్ణ మోహన్ నాయుడు, ఆర్ అండ్‌బి అధికారులు పాల్గొన్నారు.

అనుమానస్పద స్థితిలో ఎలుగుబంటి మృతి

విశాలాంధ్ర-రొళ్ల: భాజయ్యపాళ్యం గ్రామ సమీపంలో కొండ శివార్లలో ఎలుగుబంటి ఆదివారం రాత్రి అనుమానాస్పదలో మృతి చెందిందని గ్రామస్తులు తెలిపారు. కొండ శివారు నుంచి గ్రామంలో పంట పొలాల్లోకి ఆదివారం సాయంత్రం చొరబడి నాగరాజు అనే రైతు పై దాడి చేసిందన్నారు. అయిప ఆ ఎలుగుబంటి తెల్లారే సరికి అనుమానస్పద స్థితిలో మృతి చెందిందని, గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. అధికారులు గ్రామాన్ని చేరుకొని ఎలుగుబంటిని వెటర్నరీ అధికారులతో కలిసి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం ఖననం చేశారు అటవీశాఖ జిల్లా డీఎఫ్ఓ చక్రపాణి,ఉప డి.ఎఫ్.ఓ ఆనంద్,రొళ్ల బీట్ ఆఫీసర్ సంజీవరాయుడు పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, మంగళవారం 12, నవంబర్ 2024

హిందూపురంలో పేదల గుడిసెలు నేలమట్టం చేసిన పోలీసులు, రెవెన్యూ అధికారులు

కలెక్టరేట్‌కు బయలుదేరిన పేదలు, సిపిఎం నాయకులను అడుగడుగున పోలీసులు అడ్డగింత

విశాలాంధ్ర-పుట్టపర్తి : హిందూపురం సమీపంలోని కొల్లకుంట గ్రామంలో సర్వే నెంబర్ 21లో వేసుకున్న పేదల గుడిసెలను ఎలాంటి నోటీసులు, సమాచారం ఇవ్వకుండా గుడిసెలను నేలమట్టం చేయడం సిపిఎం, సిఐటియు నాయకులు పేదలు తీవ్రంగా ఖండించారు. సోమవారం హిందూపురం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కు రైలులో పేదలు, సిపిఎం నాయకులు బయలుదేరి పుట్టపర్తి రైల్వే స్టేషన్ నుంచి మామిళ్ళకుంట క్రాస్ కు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు అదనపు ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డిఎస్పీ విజయ్‌కుమార్ ఆధర్వంలో మామిళ్ళకుంట క్రాస్‌లో పేదలను, నాయకులను అడ్డుకున్నారు. దీంతో అక్కడే పేదలు, నాయకులు బైఠాయించి గుడిసెలను నేలమట్టం చేసిన వీఆర్వో, తహసిల్దారు అక్కడి పోలీసులపై చర్యలు తీసుకోవాలని నినాదాలు ఇచ్చారు. ఈ సందర్భంగా పోలీసులతో సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ ఎస్ వెంకటేష్, జిల్లా నాయకులు జెడ్పి శ్రీనివాసులు, వ్యవసాయ కార్మిక జిల్లా కార్యదర్శి పెద్దన్న తదితరులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఈనెల 8న హిందూపురం సమీపంలో ఖాళీగా ఉన్న భూమిలో సుమారు 400 మంది పేదలు, దళితులు గుడిసెలు వేసుకున్నారన్నారు. అక్కడి తహసిల్దారు, వీఆర్వో తప్పుడు నివేదికలు ఆధారంగా పోలీసులు అత్యుత్సాహం చూపించి ఈనెల 8న అర్ధరాత్రి వందల మంది పోలీసులు బుల్డోజర్లతో నేలమట్టం చేశారన్నారు.కనీసం ముందుగా నోటీసులు కానీ సమాచారం కానీ ఇవ్వకుండా పేదలను ఉన్న ఫలంగా నిర్వాసితులను చేయడం దుర్మార్గమ న్నారు. పేదలకు న్యాయం జరిగే వరకూ తాము ఆందోళన విరమించేది లేదని హెచ్చరించారు. అనంతరం అదనపు ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు 15 మందిని కలెక్టర్, ఎస్పీని కలవడానికి అనుమతించడంతో అక్కడి నుంచి కలెక్టరేట్‌కు చేరుకొని కలెక్టర్ టిఎస్ చేతన్‌కు వినతిపత్రం సమర్పించారు. కలెక్టరు స్పందిస్తూ పరిశీలించి న్యాయం చేస్తామని నాయకులకు, పేదలకు హామీ ఇచ్చారు. అనంతరం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ వి.రత్నకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు జి.ఎల్. నరసింహులు, లక్ష్మీనారాయణ, ప్రవీణ్, బాబావాలి, సాకే వెంకటేష్, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, ఎస్ ఎఫ్ ఐ బాబాజాన్, పైపల్లి గంగాధర్, ఇండ్ల స్థలాల పోరాట కమిటీ సభ్యులు జ్యోతమ్మ, నసీం తాజ్, నజియా పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక" అర్జీలను వేగంగా పరిష్కరించాలి

విశాలాంధ్ర-అనంతపురం: అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్. వి అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ తో పాటు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డిఆర్ఓ ఏ.మలోల, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 427 అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో అర్జీలను అందించేందుకు వచ్చిన ప్రజల దగ్గరకు వెళ్లి కలెక్టర్ వారి సమస్యలను తెలుసుకొన్నారు. వికలాంగులకు ప్రత్యేకంగా కూర్చునే విధంగా ఏర్పాట్లు చేయాలని, అలాగే అర్జీలు రాసిన తర్వాత క్రమపద్ధతి ద్వారా అర్జీదారుడు ఎక్కడికి వెళ్లాలో తెలుసుకునే విధంగా కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. కౌంటర్ల నందు నమోదు చేసిన ఫిర్యాదులను ఏ విధంగా అర్జీదారునికి స్లిప్పులు అందజేస్తున్నది పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు సంబంధించిన లిఫ్టును త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి న్యాయమైన పరిష్కారం వేగంగా చూపించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం డిస్ట్రిక్ లెవెల్ యువ ఉత్సవ్ - 2024కు సంబంధించిన పోస్టర్‌లను జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేడు జీపీడీపీపై శిక్షణ...

విశాలాంధ్ర-రాప్తాడు: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) 2025-2026పై మంగళవారం రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ బి.విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ఎంపీపీ, జడ్పిటిసి, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్స్, వీఓ లీడర్లు హాజరు కావాలని కోరారు.

నేడు శిక్షణ కార్యక్రమానికి హాజరుకండి

విశాలాంధ్ర-డి.హీరేహాళ్: మండలంలోని మండల అధికారులు నేడు జరగబోయే శిక్షణ కార్యక్రమానికి హాజరుకావాలని ఎంపీడీవో దాసానాయక్ అధికారులకు పిలుపునిచ్చారు. అలాగే బుధవారం శిక్షణ కార్యక్రమానికి 16పంచాయతీలలో సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొని శిక్షణ కార్యక్రమానికి హాజరుకావాలని ఎంపీడీవో దాసా నాయక్ తెలిపారు.

అక్రమ ఇసుక రవాణా అడ్డుకట్టకు గస్తీ

విశాలాంధ్ర-శింగనమల: ఎస్పీ ఆదేశాల మేరకు శింగనమల మండలం చిలేపల్లి జలాలపురం, జూలాకాలువ సమీపంలోని, ఏర్లు, వంకల నుంచి అక్రమంగా ఇసుక రవాణా అడ్డుకట్ట వేసేందుకు శింగనమల సర్కిల్ ఇన్స్పెక్టర్ కౌలుట్లయ్య, ఎస్సై శరత్ చంద్ర బందోబస్తు ఏర్పాటు చేసి పోలీసుల గస్తీ ముమ్మరం చేశారు, ఈ సందర్భంగా ఎస్ ఐ శరత్ చంద్ర మాట్లాడుతూ మండల పరిధిలో హిటాచీలు జెసిబిలు టిప్పర్లు భారీ వాహనాలు లాంటివి పెట్టి అక్రమంగా ఇసుక తరలిస్తే వారిపై చట్టరీత్యాకఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు, సోషల్ మీడియాలలో అక్రమ ఇసుక తరలిస్తున్న వీడియోలు ప్రచారం కావడంతో సోమవారం నుండి జూలాకాలువ వంక పి జలాల్పురం చిలేపల్లి, పెరవలి ఏరు దగ్గర పోలీసు గస్తీ ఏర్పాటు చేశామన్నారు,

పంట సాయం వెంటనే అందించాలి

విశాలాంధ్ర-ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ప్రకటించిన రైతుకు పంట సాయం వెంటనే అందించాలని సిపిఐ నాయకులు, రైతు సంఘం నాయకులు తహసిల్దార్ కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలల గడిచినా ఇంతవరకు ప్రకటించిన పంట సాయం అందించలేదని, ఆత్మకూరును కరువు మండలంగా ప్రకటించకుండా ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సనప నీళ్లపాల రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బండారు శివ, రైతు సంఘం మండల కార్యదర్శి బి రామాంజనే యులు, రైతులు, హనుమన్న, గోవిందు, గోపాల్ నాయక్, మండల సమైక్య నాయకురాలు నల్లమ్మ, నాగరాజు నాయక్, కృష్ణ నాయక్‌పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ...

విశాలాంధ్ర-బెలుగుప్ప: శ్రీ వరసిద్ధి వినాయక ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమాలలో భాగంగా రెండవరోజు సోమవారం పూజా కార్యక్రమాలన్నీ మలయాళ పండితులు బ్రహ్మశ్రీ శ్రీరంగం సరు న్మోహన్ తంత్రి ఆధ్వర్యంలో నిర్వహించ బడ్డాయి ఆదివారం రాత్రి ప్రతిష్టలో భాగంగా భక్తుల నడుమ వీధుల్లో వినాయకుని పల్లకీ నిర్వహించారు పూజా కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం 7 గంటలకు మహాగణపతి హెూమం, మృత్యుంజయ హెూమం, లక్ష్మీ వినాయక హెూమం, మహా సుదర్శన హెూమం, నిర్వహించారు. సాయంత్రం గాయత్రి హెూమం, భగవతి పూజ దీపారాధన దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొనగా వేద పండితులు పూజా కార్యక్రమలు నిర్వహించారు. అలాగే మంగళవారం ఉదయం ఏడు గంటలకు 108 కొబ్బరికాయల, హెూమం(కర్మ విమోచన పూజ), పదిగంటలకు సరస్వతి పూజ (విద్యార్థులకు), నాలుగు గంటలకు శత్రు దోష నివారణ పూజా (కాళీ పూజ), దీపారాధన కార్యక్రమాలు ఉంటాయని పురోహితులు తెలిపారు.

సైడు కాలువ పనులు ప్రారంభం

విశాలాంధ్ర-కూడేరు: పయ్యావుల శ్రీనివాసులు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ గారి ఆదేశాల మేరకు కూడేరు గ్రామం నందు సోమవారం సైడు కాలువ పనులు ప్రారంభించారు. టిడిపి నాయకులు జయప్రకాష్ గౌడ్, బాట వెంకటేష్, బొమ్మయ్య, గొల్ల వెంకటేష్, ఎడమల ధనుంజయ, చిన్న ఈశ్వ రయ్య, అంకె భీమన్న, ముట్టాల అక్కలప్ప, కాంట్రాక్టర్ వెంకటప్ప పాల్గొన్నారు.

ఉరవకొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 13న జాబ్ మేళా

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 13 న ఏపీఎస్ఎస్ డిసి ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అశ్రఫ్ అలీ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రతాప్ రెడ్డి తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ జాబ్ మేళా కార్యక్రమంలో టాటా క్యాపిటల్, నవభారత్ ఫర్టిలైజర్స్, యంగ్ ఇండియా లాంటి ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఇంటర్, ఐటిఐ నుంచి పీజీ వరకు చదువుకున్న ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జాబ్ మేళాకి సంభందించిన వివరాలకు కళాశాల హెడ్ అఫ్ సెక్షన్ సురేష్ బాబు ఏపీఎస్ఎస్ డిసి కోఆర్డినేటర్ జయలక్ష్మి మరియు అనిల్ ని సంప్రదించవచ్చున్నారు. మరిన్ని వివరాలకు 7013800115 నెంబర్ కు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవాలన్నారు.

ఉర్దూ పాఠశాలలో పుస్తకాల పంపిణీ

విశాలాంధ్ర- కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం ఉర్దూ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కేంద్ర మాజీ విద్యా శాఖ మంత్రి మౌలానా ఆజాద్ పుట్టినరోజు సందర్భంగా నోట్ పుస్తకాలు, పెన్నులు అందించినట్లు సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చల్లపల్లి వీరయ్య చౌదరి తెలిపారు. కేంద్ర మంత్రిగా, సంఘసంస్కర్తగా మౌలానా ఆజాద్ చేసిన సేవలు విద్యార్థులకు వివరించారు.ఇ ఫక్రుద్దీన్ సాబ్, కళ్యాణ దుర్గం పట్టణ అధ్యక్షుడు బోయ నాగరాజు, మైనారిటీ అధ్యక్షుడు కొలిమి దాదా పాల్గొన్నారు

గర్భవతులకు వైద్య పరీక్షలు...

విశాలాంధ్ర-యాడికి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం పిఎంఎస్ ఏ కార్యక్రమంలో భాగంగా హై రిస్క్ గర్భవతులను 70 మందికి వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి తగు సూచనలు సలహాలు తెలియజేశారు. అదేవిధంగా ప్రతి నెల 9వ తేదీన పిఎంఎస్ఏ ప్రోగ్రాం నందు గ్రామంలో నుండి ఆశా కార్యకర్త కు గర్భవతులను పిహెచ్‌సి తీసుకురమ్మని తెలిపారు గర్భవతులకు సి రమణారెడ్డి రాయలచెరువు గర్భవతులకు, భోజన వసతి కల్పించారు తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ వారికి పర్సనల్ ఐజి గురించి పరిసరాల పరిశుభ్రత గురించి డ్రైడే ఫ్రైడే గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీరాం డాక్టర్ పరమేష్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, సిహెచ్ఓ జుబేదా, పిహెచ్ఎన్ వెంకటలక్ష్మి, సూపర్వైజర్ రాంప్రసాద్ గౌడ్, ఎల్‌డి కంప్యూటర్ సరితా దేవి, ఎం.ఎల్.హెచ్.పిలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా మైనార్టీ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-అనంతపురం రూరల్ : కాంగ్రెస్ పార్టీ యం.పి., నేషనల్ మైనార్టీ చైర్మన్ ఇమ్రాన్ ప్రతాప్ గర్హి ఆదేశాల మేరకు ఏపీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు వై.యస్.షర్మిళ నాయకత్వాన్ని బలపరుస్తూ... రాష్ట్ర మైనార్టీ డిపార్ట్మెంట్ అధ్యక్షుడు దాదా గాంధీ గారి ఆధ్వర్యంలో అనంతపురం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవార "మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ 137వ జయంతి మరియు జాతీయ విద్యా దినోత్సవం" వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన దాదా గాంధీ చేతుల మీదుగా మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ గారి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం దాదా గాంధీ మాట్లాడుతూ... భారతదేశ మొదటి కేంద్ర విద్యాశాఖ మంత్రి అయిన మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ గారి జయంతి రోజున పేద ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషంకం వుందన్నారు. పవిత్ర మైనా మక్కాలో మౌలానా అబుల్ కలామ్ జన్మించి భారతదేశ ప్రధాని పండింట్ జవహర్ లాల్ నెహ్రూ కేబినెట్లో మొదటి కేంద్ర విద్యాశాఖ మంత్రిగా సేవలు అందిస్తూ విద్యకు సంబంధించి అనేక సంస్కరణలు తీసుకువచ్చి విద్యకు పెద్ద పీట వేస్తు ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డీసీసీ జనరల్ సెక్రటరీ యం.యం.డి.ఇమామ్, యన్.యస్.యు.ఐ. నాయ కులు నరేష్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండుగగా ఆంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం

విశాలాంధ్ర-శెట్టూరు: మండల కేంద్రంలో ఆంజనేయ స్వామి నూతన దేవాలయా ప్రారంభోత్సవం సోమవారం కన్నుల పండుగగా నిర్వహిం చారు. మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు వివిధ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపనకు కార్యక్రమానికి మాజీ పార్లమెంట్ సభ్యులు కళ్యాణ్ దుర్గం నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య హాజరయ్యారు. ముందుగా ఆలయ అర్చకులు చేత శ్రీ ఆంజనేయస్వామి దేవాలయానికి పూలమాలలు సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్టాపన, కలశం స్థాపన నవగ్రహాలు పూజ పాల్గొని అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి దేవుని ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ కలగాలని మనసారా కోరుకున్నారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, జడ్పిటిసి మంజునాథ్, ఆలయ కమిటీ సభ్యుల సోమనాథ్ రెడ్డి, కేశవరెడ్డి, ఆదిశేషు, గొల్ల వెంకటేశులు, ఎమ్మెస్ రాయుడు, గురు ప్రసాద్, డి.తిప్పేస్వామి, పోస్ట్ రామకృష్ణ పాల్గొన్నారు.

రబీ సీజన్ రాయితీ వేరుశనగ పంపిణీ...

విశాలాంధ్ర-కూడేరు: జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారుల ఆదేశాల మేరకు 13వ తేదీ నుండి 2024 -25 సంవత్సరం సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రాయితీ వేరుశనగ పంపిణీ ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి జయ కుమార్ సోమవారం విలేకరులకు తెలిపారు. కూడేరు మండలంలోని రైతులు గ్రామాల పంచాయతీలోని రైతు సేవా కేంద్రాలలో బుదవారం నుండి రాయితీ వేరుశెనగ రిజిస్ట్రేషన్, చేపడుతున్నట్లు తెలియజేశారు. చేసుకున్న రైతులకు పంపిణీ జరుగుతుంది. కావాల్సిన రైతులు తమ గ్రామ రైతు సేవా కేంద్ర సిబ్బంది తో రైతు ఆధార్ కార్డ్ ఫోటో స్టార్ట్, కరెంట్ రసీదు, రైతు పట్టాపాస్ పుస్తకాలు అందజేసి రిజిస్ట్రేషన్ చేసుకోవలసినదిగా రైతులకు తెలియజేశారు, అర్ధ ఎకరాకు 30 కేజీల ఒక బ్యాగు ఒక ఎకరా ఉన్న రైతుకు మూడు బ్యాగులు అందజేయడం జరుగుతుందని,30 కేజీలు సబ్సిడీ ఫోను 1728 రూపాయలు, మూడు బ్యాగులు ధర సబ్సిడీ పోను 5184 రూపాయలు రైతుప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుందని అన్నారు.

వరి పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్త

విశాలాంధ్ర-పెనుకొండ: మండల పరిధిలోని వెంకట గిరి పాళ్యం రైతు సేవా కేంద్రం పరిధిలో చీడపీడల వలన దెబ్బతిన్న వరి పొలాలను పుట్టపర్తి ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డా.కె. రామసుబ్బయ్య, పెనుకొండ మండల వ్యవసాయ అధికారిణి కె.సి.చందన సోమవారం రైతులతో కలిసి పరిశీలించారు. శాస్త్రవేత్త డా.కె. రామసుబ్బయ్య మాట్లాడుతూ సుడిదోమ ఆశించడం వలన వరి పంట దెబ్బతినిందని, పొలంలో గాలి, వెలుతురు తగినంత లేని కారణంగా సుడిదోమ ఆశించింది, కనుక రైతులు ప్రతి రెండు మీటర్ల వరి నాట్లకు 20 సెం.మీ.ల కాలి బాటలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పంట మార్పిడి విధానం అవలంబిం చాలన్నారు. బిపిటి వరి రకాన్ని సుడిదోమ ఎక్కువగా ఆశించి నష్టపరుస్తుంది. కావున, సుడిదోమను తట్టుకునే వరి రకాలను సాగు చేయాలని తెలిపారు. పొలాన్ని అడపా దడపా ఆరబెట్టాలి.సుడిదోమ ఆశించిన తర్వాత .ఎసిఫేట్ 75 యస్.పి.= 1.5గ్రా. (లేక)ఇమిడాక్లోప్రిడ్ ం ఎథిప్రోల్ 80 డబ్ల్యుజి = 0.25గ్రా. (లేక) పైమెట్రోజైన్ 50 డబ్ల్యు.జి.= 0.6 గ్రా. లేదా ఫ్లోనికామిడ్ 50 ఎస్.జి. = 0.4 గ్రా. (లేక) డైనోఫ్యురాన్ 20 ఎస్. జి.= 0.4 గ్రా. లేదా ట్రైఫ్లుమిజోపైరిమ్ 10 యస్.సి. = 0.48 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు.

మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ సేవలు మరువలేనివి

విశాలాంధ్ర-పెనుకొండ: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని ప్రిన్సిపాల్ సుదర్శన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్వతంత్ర భారతదేశానికి తొలి విద్యాశాఖ మంత్రి ఈయన 1888లో అరేబియా మా నగరంలో నీ మక్కా ప్రాంతంలో జన్మించాడని, ఈయన అనేక విద్యాసంస్కర ణలు చేసి దేశ అభ్యుదయానికి కృషి చేశాడని ప్రిన్సిపాల్ తెలిపారు. మౌలానా అంటే పండితుడు అబుల్ కలాం అంటే భాష జనకుడు ఆజాద్ అనగా ఆయన కలం పేరు అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఓ హఫీజ్, శంకర్ నాయక్, శ్రీలేఖ, సుశీల బాయ్ పాల్గొన్నారు.

ఆయకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

విశాలాంధ్ర-ముదిగుబ్బ: స్థానిక పీవీస్ స్కూల్లో సాంకేతిక వైజ్ఞానిక ప్రదర్శన ఘనంగా నిర్వహించారు. విద్యార్తులు చేసిన నమునాలని పాఠశాల చైర్మన్ పీవీఎస్ నాయుడు తిలకించి అభినందించారు.ఈ సందర్భంగా పీవీ నాయుడు మాట్లాడుతు విద్యార్థులు చిన్న వయస్సు నుంచే ఆవిష్కరణలు చేస్తే వారిలో ఆలోచన మరియు సృజనాత్మకత పెంపొందుతుందని శాస్త్ర సాంకేతిక రంగాలలో అభివృద్ధి చెందేందుకు ఇలాంటి ప్రదర్శనలు ఉపయోగ పడతాయని తెలియజేసారు. కార్యక్రమంలో చైర్మన్ పీవీఎస్ నాయుడు, అకడమిక్ ఇంచార్జి మనీషా,ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులు తయారు చేసిన నమూనాలని తిలకించి విద్యార్థులను అభినందించారు.

నేడు ఉపాధి హామీపై ప్రజావేదిక

విశాలాంధ్ర-ఓబుళదేవరచెరువు: స్థానిక సమీకృత వసతి కేంద్రంలోనేడు మంగళవారం ఉపాధి పథకం కింద చేపట్టిన పనులపై ప్రజావేదిక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏపిఓ సుధాకర్ తెలిపారు. 2023-24 ఏడాదిలో చేపట్టిన 513 పనులకు రూ.4.27 కోట్లు కూలీల పనులకు ఖర్చు చేశామని, అలాగే మెటీరియల్ పనులకు రూ.2.67కోట్లు చేసామన్నారు. ఈ పనుల్లో జరిగిన వృధా నిధులపై ప్రజావేదికలో వెల్లడిస్తామన్నారు. ప్రజా వేదిక సమావేశానికి అధికారులు, ఉపాధి కూలీలు, ప్రజాసంఘాలు హాజరు కావాలని కోరారు.

బాల్యవివాహాలను నిర్మూలిద్దాం

విశాలాంధ్ర-రామగిరి: బాల్యవివాహాలను సమూలంగా నిర్మూలించేందుకు సమన్వయంతో కృషి చేద్దామని ఆర్. డి.టి ఏటిఎల్ పద్మావతి పిలుపునిచ్చారు. సోమవారం రామగిరి మండల కేంద్రంలోని ఏపీ మోడల్ పాఠశాలలో చదువుతున్న బాలికలకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వలన భవిష్యత్తులో అనేక రుగ్మతలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. పీరియడ్ సమయంలో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల జరిగే లాభాలను గురించి వివరించారు. అలాగే సమాజంలో ఆడపిల్లలు ఎలాంటి జాగ్రత్తలను పాటించాలో తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సర్వేశ్వరి, ఎస్టిఎల్ శారద, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీకి సన్మానం

విశాలాంధ్ర-రొళ్ల: నియోజకవర్గంలోని అంగన్వాడి సెంటర్లకు,పాఠశాలలకు కోడిగుడ్లు సరఫరా చేస్తున్న ఐదు మండలాలకు సంబంధించిన ఎగ్ ఏజెన్సీ నిర్వాహకులు సోమవారం రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామి గారిని యాదవ కళ్యాణమండపంలో మర్యాదపూర్వకంగా కలిసి వారికి పూలమాల వేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమం అభివృద్ధిలో దూసుకుపోతున్నట్లు ప్రజలకు వివరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు దాసిరెడ్డి,నియోజకవర్గం ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి,హేమంత్,డీలర్ మంజునాథ తదితరులు పాల్గొన్నారు..

ఉషచరణ్ శ్రీ మాట్లాడిన తీరు సరి కాదు

విశాలాంధ్ర-కదిరి: కదిరి నియోజకవర్గ. అభివృద్ధిపై వైసీపీ జిల్లా అధ్యక్షులు ఉష చరణ్ శ్రీ మాట్లాడిన తీరు సరికాదని జనసేన పార్టీ ఇంచార్జ్ బైరవ ప్రసాద్ తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచిని ఓర్వలేక మాట్లాడుతున్న వైసీపీ నాయకులు కొంచెం నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హితువు పలికారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు లోపించాయనీ, వైసీపీపీ పార్టీ నాయకులపై సోషియల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి హింసిస్తున్నారని, కదిరి నియోజక వర్గంలో అభివృద్ధి జరగలేదని, ప్రెస్ మీట్ పెట్టడం కాదు మాతో వచ్చి చూడండి చూపిస్తామని తెలిపారు. "గత అసమర్థ పాలకులు జగన్ మోహన్ రెడ్డి అన్నీ వ్యవస్థలను నాశనం చేసారన్నారు.ఈ కార్యక్రమంలో చిన్నపరెడ్డి,లక్ష్మణ్,రవికుమార్,అంజిబాబు, గంగరాజు, రాజేంద్ర ప్రసాద్, రమణ,ప్రతాప్,రాజ పాల్గొన్నారు.

రబీ టమోటాకు వాతావరణ బీమా

విశాలాంధ్ర-బెలుగుప్ప: కళ్యాణదుర్గం డివిజన్ నందు రబీలో టమాట పంటను సాగు చేస్తున్న రైతులకు వాతావరణ బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు కళ్యాణదుర్గం ఉద్యనాధికారి కృష్ణ తేజ తెలిపారు. బెలుగుప్ప మండలంలోటమాట పంట సాగు చేసే రైతులు ఈ క్రాప్ నమోదు తో పాటు ఎకరాకు 1600/- రూపాయల ప్రకారం డిసెంబర్ 15 లోపల చెల్లిస్తే, పంట నష్టపోతే ఎకరాకు 32000/- రూపాయలు పొందవచ్చని తెలిపారు. టమోటా పంట సాగుకు బ్యాంకు రుణం తీసుకునే రైతులు ఆయా బ్యాంకులో ప్రీమియం చెల్లించాలన్నారు పంట రుణం తీసుకొని రైతులు కామన్ సర్వీస్ సెంటర్ లేదా రైతు సేవ కేంద్రంలో భూమి ఆధార్, బ్యాంక్ అకౌంట్, పంట ధ్రువీకరణ పత్రాలను అందించి, ప్రీమియం చెల్లించవచ్చు అన్నారు. మరిన్ని వివరాలకు అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ జిల్లా మేనేజర్ కృష్ణసాగర్ 9912275799లో సంప్రదించాలని తెలిపారు.

జాతీయస్థాయి సెపక్ తక్రా పోటీలకు ఎంపికైన సి. తేజ

విశాలాంధ్ర-ఉరవకొండ: స్థానిక మహేశ్వరి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న సి.తేజ డిసెంబర్ 26 నుంచి మణిపూర్ ఇంఫాల్లో జరిగే జాతీయ స్థాయి సెపక్తక్రా పోటీలకు ఎంపిక య్యారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల ప్రిన్సిపాల్ సునంద, పిడి. ఎర్రి స్వామి, పిఈటి. మోహన్ విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 9,10 తేదీలలో కర్నూలు జిల్లా సి. బెళ్లగల్ గ్రామంలో అండర్ 17 రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ పోటీలు జరిగాయని ఈ పోటీలలో మహేశ్వరి పాఠశాలకు చెందిన సి. తేజ ఎన్ మోసెస్ అత్యంత ప్రతిభ కనబరిచిన తేజ జాతీయ స్థాయికి ఎంపిక కావడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా తేజాను పాఠశాల ప్రిన్సిపాల్ పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

పేకాట రాయుళ్ళు ఆరుగురు అరెస్ట్

విశాలాంధ్ర-తాడిపత్రి: పేకాట రాయుళ్ళు ఆరుగురు అరెస్టు చేసి వారి వద్ద నుండి నాలుగు లక్షల 45 వేల రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ శివగంగాధర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రూరల్ పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ జగదీశ్ ఆదేశానుసారం సబ్-డివిజనల్ పోలీస్ అధికారి పి.రామక్రిష్ణుడు ఉత్తర్వుల మేరకు నేను ఎస్సై ధరణి బాబు, ఏఎస్ఐ సమాచారం మేరకు మధ్యహ్నం 01.00 గంటల సమయంలో మండలం లోని చుక్కలూరు గ్రామ పరిధిలో ఉన్న సపోటా తోటలో పేకాట ఆడుతున్న తాడిపత్రి పట్టణానికి చెందిన జి. శివ దత్తా ఏ శవాల శివ, జి.సోమశేఖర్ రెడ్డి పి.రామాంజినేయులు, షేక్ రహీం బాష ఏ చోటు, బి. హనుమంతు రెడ్డి, జి.రామనాథ రెడ్డి అనే ఆరుగురును అరెస్ట్ చేసి కేసు నమోదు చేయడం అయినదని చెప్పారు.

నిర్మాణ రంగంలో కొత్త పుంతులు..

హాబిలెట్ లెర్నింగ్ సొల్యూషన్స్ డైరెక్టర్ పి.కిషోర్

విశాలాంధ్ర-జెఎన్టియుఏ: 3డి సాంకేతిక ప్రమాణాలతో తక్కువ ఖర్చు, నిర్మాణరంగంలో కొత్త పుంతలతో.. ఆవిష్కరణలకు నాంది పలుకుతున్నాయని హాబిలెట్ లెర్నింగ్ సొల్యూషన్స్ కంపెనీ డైరెక్టర్ కేరళ డాక్టర్ పి కిషోర్ పేర్కొన్నారు. సోమవారం మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్, మదనపల్లె కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగము వారు కళాశాల మిట్స్ ఐఎస్‌టి ఈ స్టూడెంట్స్ చాప్టర్ సహకారంతో 3డి బీమ్ మోడలింగ్ యూసింగ్ రెవిట్ అండ్ నావిస్ వర్క్స్ మేనేజ్ అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ..నాణ్యత నియంత్రణ, వినూత్న పద్ధతులు, మన్నిక, సామర్థ్యాన్ని పెంచే ఉత్తమ అభ్యాసాలను తెలుసుకోవాలన్నారు. కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ దీపాంకర్ రాయ్, ఫాకల్టీ కోఆర్డినేటర్ ఆర్ వినోద్ కుమార్ , మిట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ దివ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా ప్రశాంతి..

విశాలాంధ్ర-తనకల్లు: విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా కె.ప్రశాంతి బాధ్యతలు స్వీకరించినట్లు ఏవో శ్రీహరి నాయక్ తెలిపారు. నల్లచెరువు మండలంలో సచివాలయంలో ఐదు సంవత్సరాలు పనిచేసి సీనియార్టీ ప్రకారం ప్రమోషన్ పొంది ఈ మండలంలో ఏఈఓగా బాధ్యతలు చేపట్టిందన్నారు. అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని, సిబ్బందితో పాటు రైతులు సహకరించాలని కోరారు.

ఆసుపత్రి కమిటీ సభ్యుల సమావేశం

విశాలాంధ్ర-రొళ్ల: స్థానిక కమ్యూనిటీ వైద్యశాలలో సోమవారం నూతనంగా ఎన్నికైన ఆసుపత్రి కమిటీ సభ్యులు సిబ్బందితో డాక్టర్.బాల ప్రణీత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి కమిటీ సభ్యులు రమేష్ గౌడు కాంతరాజు,ముధపేగౌడు మాట్లాడుతూ ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు ఆస్పత్రి సమస్యలను సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు మడకశిర నియోజకవర్గం ఎమ్మెలల్యే ఎమ్మెస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి నాయకత్వంలో ఆసుపత్రిలో సమస్యలను పరిష్కరించడానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు 108 వాహనం మండల కేంద్రంలో నిత్యం అందుబాటులో ఉండే విధంగా చూడాలని మండలంలో చాలా గ్రామాలు మారుమూల ప్రాంతం లో ఉన్నాయని అకస్మాత్తుగా ప్రమాదాలు సంభవించే త్వరగా ఆసుపత్రికి చేరుకోవడానికి వాహన సౌకర్యం కావాలని కోరారు. పాము కాటు వేసిన వ్యక్తులు త్వరగా వైద్య అందక ప్రాణాలు పోయే పరిస్థితి సంభవించకూడ దని ఉద్దేశంతో త్వరగా ప్రథమ చికిత్స జరగడానికి కనీసం మందులు సౌకర్యం కల్పించాలని వారు కోరారు.అదేవిదంగా ఆస్పత్రి కమిటీ సభ్యులు మరియు ఇతరుల సహాయంతో తాగునీటి సౌకర్యం కోసం ఆస్పత్రికి 25000 రూపాయిలతో త్వరలోనే వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సత్యసాయి జిల్లా టి.ఎన్.టి. యు.సి ఉపాధ్యక్షుడు బ్యాడగేరె మూర్తి, నాయకులు మంజునాథ్,బ్యాటప్ప వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.